క్లుప్తంగా

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



మాగనూర్(మక్తల్): ఉచిత వేసవి శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత పీఈటీ గోపాలం అన్నారు. మక్తల్ పట్టణంలోని సాయిజ్యోతి ప్లే గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఉచిత సమ్మర్ క్యాంపు ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఈనెల 31వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పీఈటీలు రాఘవేంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ మేట్‌పై చర్యలు తీసుకోవాలి



మాగనూర్: మండలంలోని ఉజ్జెల్లి గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడుతున్న సీనియర్ మేట్ సోమలింగంపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం పంచాయతీ కార్యదర్శి నర్సింహారెడ్డికి గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామంలో నిర్వహిస్తున్న పనుల్లో కూలీల హాజరులో తప్పుల తడకగా ఉందన్నారు. ముఖ్యంగా పనికి వచ్చిన కూలీలకు హాజరు వేయకుండా, పనికి రాని వారి పేర్లు రికార్డుల్లో నమోదు చేస్తు వారితో పర్సంటేజ్ ఒప్పందం చేసుకుంటున్నట్లు ఆరోపించారు. అదే విధంగా ఒక వర్గానికి మాత్రమే పనిచేస్తు గ్రామస్తులకు ఇబ్బందులు కలిగిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో కేంద్రం విఫలం



దామరగిద్ద: నిత్యావసరాల ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం నాయకుడు హన్మంతు అన్నారు. శుక్రవారం మండలంలోని ఆశన్‌పల్లి గ్రామంలో మే డే ఉత్సవాలు నిర్వహించి పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలక పార్టీలు ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా మద్యం ధరలు పెంచి, బెల్టు షాపులు ప్రోత్సహిస్తుందని మండిపడ్డారు. యువత మేల్కొని విద్యా, వైద్య రంగాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐక్యం కావాలన్నారు. కార్యక్రమంలో గోవిందప్ప, కిష్టప్ప, రోజా, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఉద్యోగుల నిరసన



మాగనూర్: మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయం వద్ద ఉపాధి హామీ ఉద్యోగులు శుక్రవారం విధుల బహిష్కరించి నిరసన చేపట్టారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు నాలుగు రోజుల నుంచి పెన్ షట్‌డౌన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏపీవో మన్యం తెలిపారు. 4 నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదని వాపోయారు. ప్రభుత్వం బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. లేని యెడల సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నేడు 'చలో బస్‌భవన్'

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ కార్మికులపై రోజురోజుకు పెరుగుతున్న పనిభారంతో పాటు బకాయిల చెల్లింపు, విశ్రాంత ఉద్యోగుల బకాయిలు తదితర సమస్యలు పరిష్కరించాలంటూ శనివారం చలో బస్‌భవన్ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు ఐఎన్‌టీయూసీ అనుబంధమైన స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రీజినల్ కార్యదర్శి విజయ్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు కార్యక్రమం చేపడుతున్నట్లు.. జిల్లాలోని ఆర్టీసీ కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



గుడెబల్లూర్ శివారులో రాస్తారోకో చేస్తున్న రైతులు



కన్మనూర్ మిల్లు వద్ద నిరసన చేస్తున్న రైతులు

కృష్ణా: రైస్ మిల్లర్లు ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు రాస్తారోకో చేపట్టారు. మిల్లుల్లో దించుకోకుండగా వేధిస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం ఉదయం జాతీయ రహదారిపై గుడెబల్లూర్ శివారులో గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. మిల్లుల యజమానులు కేవలం 1010, దొడ్డురకం ధాన్యాన్ని మాత్రమే మొదట ప్రాధాన్యమిచ్చి తీసుకుంటున్నారన్నారు. నాలుగు రోజులుగా మిల్లు వద్ద వేచి చూస్తున్నా దొడ్డురకం ధాన్యాన్ని అప్పటికప్పుడే తీసుకుంటున్నారన్నారు. అదే విధంగా ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం పూర్తిగా ఎండటంతో ధాన్యంలో నూకలు వస్తున్నాయని చెబుతూ క్వింటాల్‌కు 2 నుంచి 3 కేజీల చొప్పున తరుగు తీస్తున్నారని వాపోతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఎండీ నవీద్, తహసీల్దార్ వెంకటేష్ అక్కడి చేరుకొని రైతులతో చర్చించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న రైస్ మిల్లులో రైతుల తెచ్చిన ధాన్యాన్ని దింపిస్తానని ఎస్‌ఐ నవీద్ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. రాస్తారోకో కారణంగా దాదాపు 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం ఏర్పడింది.

ధాన్యం బస్తాలు దింపుకోవాలని నిరసన

మరికల్: మిల్లుకు తీసుకొచ్చిన ధాన్యం బస్తాలను దింపుకోవాలని రైతులు శుక్రవారం కన్మనూర్ మిల్లు వద్ద నిరసన వ్యక్తం చేశారు. నాలుగు రోజుల పాటు నిద్రాహారాలు విడిచి ధాన్యం దించుకుంటారని ఆశతో ఎదురుచూస్తున్నట్లు వాపోయారు. అధికారులు వచ్చే వరకు ఇక్కడే ఉంటామని ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో మిల్లు యాజమాని సివిల్ సప్లయ్ జిల్లా డీఎం సైదుల దృష్టికి తీసుకెళ్లారు. మిల్లు యజమాని మాట్లాడుతూ.. 4 వేల ధాన్యం బస్తాలను మాత్రమే అన్‌లోడ్ చేసుకుంటామని, అధికారులు అనుమతి ఇస్తే మరో 25 వేల ధాన్యం బస్తాలకు అన్‌లోడ్ చేసుకునేందుకు వీలుందని పేర్కొన్నారు.

రాఘవేంద్రస్వామికి మఠాధిపతి పూజలు



నారాయణపేట రూరల్: పట్టణంలోని రాఘవేంద్ర స్వామి ఆలయాన్ని శుక్రవారం ఉడిపి ఆదిమారు మఠాధిపతి విశ్వప్రియ తీర్థులు దర్శించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామిజీ భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాఘవేంద్రస్వామిని కొలిచిన వారికి కొంగుబంగారంగా నిలుస్తూ కోరిన కోర్కెలు తీరుస్తున్నారన్నారు. స్వామిని కొలిచి మానవ జన్మను సార్థకం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాఘవేంద్ర సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలని వినతి



ఎంపీఓకు వినతిపత్రం అందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కృష్ణా: మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల బీఆర్‌ఎస్ నాయకులు ఎంపీఓ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో అర్హులకు ఇళ్లు మంజూరు కాని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలంటూ తహసీల్దార్ వెంకటేష్, ఏఎస్‌ఐ సురేంద్రబాబుకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో నాయకులు శివరాజ్‌పాటిల్, శివప్ప, లింగప్ప, శంకర్‌నాయక్, మాలింగప్ప,అంబ్రేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య



విద్యార్థులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

దామరగిద్ద: ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అంబాజీ, సీనియర్ అధ్యాపకులు రాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను కలిసి ప్రభుత్వ కళాశాలల్లో గల సదుపాయాలపై అవగాహన కల్పించారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో ఉచిత విద్యను అభ్యసించి ప్రభుత్వం అందించే సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



సమస్తాపూర్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు

ఊట్కూరు: రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ కృష్ణంరాజు అన్నారు. శుక్రవారం తెలంగాణ, కర్ణాటక సరిహద్దులోని సమస్తాపూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఎస్‌ఐ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అక్రమంగా వచ్చే వరిధాన్యానికి అడ్డుకట్ట వేయాలన్నారు. నిరంతరం పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



క్రీడా శిబిరంలో జిల్లా అధికారి వెంకటేశ్

మద్దూరు: విద్యార్థులు శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన క్రీడా అధికారి వెంకటేశ్ అన్నారు. క్రీడా సాధికార సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన క్రీడా శిబిరాన్ని శుక్రవారం సందర్శించారు. క్రీడల్లో జాతీయస్థాయిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపధ్యాయురాలు సవిత, ఉపాధ్యాయులు రఘు, బాలాజీ, సత్యం విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా ఆదిశంకరుల జయంతి



జయంతి వేడుకల్లో స్వామిజీ శాంతానంద

నారాయణపేట రూరల్: జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతిని పురస్కరించుకొని శంకర సేవా సమితి ఆధ్వర్యంలో ఉత్సవాలను పట్టణంలోని దేవ్‌జీ నివాసంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తికి మహా పంచామృతాభిషేకంర, శారద భజన మండలి ఆధ్వర్యంలో మహిళలచే సామూహిక లలిత సహస్త్ర నామ పారాయణం, సామూహిక కుంకుమార్చనలు చేశారు. ఉత్సవ మూర్తి శోభాయాత్ర, పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం శక్తిపీఠం వ్యవస్థాపకులు డాక్టర్ స్వామి శాంతానంద శంకరాచార్యుల విజయ గాథను వివరించారు. కార్యక్రమంలో ధరణీధర్ దీక్షిత్, విద్యాధర్ దీక్షిత్, ధీరజ్ దీక్షిత్, శివానంద్ పురోహిత్, విభావసు పురోహిత్, అర్చకులు వేణుగోపాలచార్యులు, పద్మావతి, రాజేశ్వరి భక్తులు పాల్గొన్నారు.

కార్మికుల రాజ్యం వచ్చేదాకా పోరాడుదాం



అమరచింతలో సీపీఎం జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

పాన్‌గల్: కార్మికుల రాజ్యం వచ్చేదాకా పోరాటాలు కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, మండల కార్యదర్శి బాల్యనాయక్ అన్నారు. మే డే ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కేతేపల్లిలో ఎర్రజెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల పక్షాన ఉంటూ వారి సంక్షేమం కోసం ఎర్రజెండా ఎన్నో పోరాటాలను కొనసాగిస్తుందన్నారు. కూలీ కోసం, భూమి పోరాటాలు, స్థానిక సమస్యల పరిష్కారంపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తూ ప్రజల పక్షాన నిలుస్తుందన్నారు. రాబోయే కాలంలో పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, స్థానిక సమస్యల పరిష్కారం కోసం జరిగే ఉద్యమాలల్లో రైతులు, కార్మికులు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు.

అమరచింత: పట్టణంలో శుక్రవారం మే డే ఉత్సవాలను సీపీఎం, బీఆర్టీయూ ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్వహించారు. ఈమేరకు పట్టణంలోని 9 వార్డులో ఉన్న సీపీఎం జెండాను మాజీసర్పంచ్ గోపాల్ చేతుల మీదుగా ఆవిష్కరించగా.. బీఆర్టీయూ జెండాను ఆ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అబ్రహం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీఎస్.గోపి, వెంకటేష్, బాలరాజ్ పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరణ

మద్దూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా కృష్ణారెడ్డిని శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ ప్రిన్సిపాల్ నారాయణగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారు

నర్వ: రైతుల కష్టాన్ని రైస్ మిల్లర్లు దోచుకుంటున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి దుయ్యబట్టారు. శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తరుగు పేరుతో 40 కేజీల బస్తాకు 3 నుంచి 4 కిలలో ధాన్యం తీయడం ఎంత వరకు సమంజసమన్నారు. అనేక మంది రైతులు మోసపోయి లబోదిబోమంటున్న అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. మండలంలోని ఉందేకోడ్‌కు చెందిన చాకలి రమేష్ అనే రైతు విశాల్ రైస్ మిల్లులో ధాన్యం విక్రయిస్తే ఏకంగా 19 క్వింటాళ్ల తరుగు తీశారని, అదే విధంగా లక్కర్‌దొడ్డికి చెందిన శివన్న 100 బస్తాలు విక్రయిస్తే 4 క్వింటాళ్లు తరుగు పేరుతో దగా చేశారన్నారు. ఇలాంటి అక్రమాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ రైతుల తరపున ఉద్యమం చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కులగణన ఘనత బీజేపీ నాయకులదే

నారాయణపేట రూరల్: దేశంలో కులగణన ఘనత బీజేపీ స్వర్గీయ నేత సుష్మాస్వరాజ్‌దేనని పట్టణ బీజేపీ అధ్యక్షుడు పోషల్ వినోద్‌మార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీల అభ్యున్నతి, మహిళా సాధికారతతోనే సాధ్యమని తలచిన ప్రధాని నరేంద్రమోదీ చేపట్టబోతున్న కులగణన నిర్ణయాన్ని స్వాగతిస్తూ ధన్యవాదాలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



నారాయణపేట రూరల్: లయన్స్ క్లబ్, నిత్యా ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్న పిల్లల ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైనట్లు నిర్వాహకులు తెలిపారు. గత రెండు రోజులుగా పిల్లలకు వైద్యసేవాలనందించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి అభినందించారు. కార్యాక్రమంలో లయన్స్ సభ్యులు హరినారాయణ్ బట్టడ్, సదాశివ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో సైనికుడిలా పనిచేస్తా

నారాయణపేట రూరల్: సమాజ సేవలో సైనికుడిలా పనిచేస్తానని లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ హరినారాయణ్ బట్టడ్ అన్నారు. ఇటీవల డాక్టరేట్ పొందిన హరినారాయణ్ బట్టడ్‌కు శుక్రవారం స్థానిక ఎస్‌ఆర్ గార్డెన్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గుడిపల్లి రాఘవేంద్రరెడ్డి, కార్యదర్శి బాలాజీ కాంబ్లె, కోశాధికారి మోహన్ పాల్గొన్నారు.



వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



కృష్ణానది నీటిని కలశాలతో తీసుకెళ్తున్న మహిళలు

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ గ్రామ పంచాయతీలోని మారుతీనగర్‌లో ఇటీవల నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు కృష్ణానది నీటిని కలశాలతో ఆలయం వద్దకు చేరుకొని పూజలు చేశారు. ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు మూడు రోజుల పాటూ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న సభ్యులు

నారాయణపేట ఎడ్యుకేషన్: భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నారాయణపేటలోని ఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని భీష్మరాజ్ ఫౌండేషన్ సభ్యుడు గద్దం తిప్పన్న సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో జాబ్‌మేళా కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. శనివారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెగా జాబ్‌మేళాలో సుమారుగా 50కి పైగా కంపెనీలు పాల్గొనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పోలీస్ పటేల్, మధుసూదన్ రెడ్డి, హన్మంతు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలు కొనసాగిద్దాం



ప్రచారం చేస్తున్న మాస్‌లైన్ నాయకులు

ఆత్మకూర్: షహీద్ భగత్‌సింగ్ త్యాగాలు మరువలేనివని, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు యువత సిద్ధం కావాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లానాయకులు ప్రసాద్, హన్మంతు, రాజు అన్నారు. శుక్రవారం ఆత్మకూర్‌లో భగత్‌సింగ్ జీపు జాతాను నిర్వహించారు. ఈ నెల 5న మక్తల్ పట్టణంలో భగత్‌సింగ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చెన్నయ్య, వెంకటయ్య, అంజన్న తదితరులు ఉన్నారు.

విద్యుత్ తీగలు సరిచేయండి



కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను చూపుస్తున్న రైతు భాస్కర్

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం గ్రామంలో రైతు మినిగే భాస్కర్ పొలంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. సరి చేయాలని పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం వరి పంట కోతకు వచ్చిందని.. పొలంలో వేలాడుతున్న విద్యుత్ తీగలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో కోత కోసేందుకు కోత మిషన్‌లు రావడం లేదని రైతు ఆవేదన చెందుతున్నాడు. ఇప్పటికైన అధికారులు స్పందించి పొలంలో ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ వైర్లను సరిచేయాలని కోరారు.

రహదారులపైనే నూర్పిళ్లు



మండలంలోని నాగల్‌కడ్మూర్ ప్రధాన రహదారిపై వరిధాన్యం ఆరబోసిన రైతులు

- ధాన్యం కాంటా కాకపోవడంతో రైతుల అవస్థలు
- భయపెడుతున్న ఈదులుగాలులు, అకాల వర్షాలు

అమరచింత: పండించిన వరి ధాన్యం ఎండిన తర్వాత అమ్ముకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు దాపరించాయి. ధాన్యం ఎండపోవడానికి పంట పొలాల వద్ద స్థలాలు లేకపోవడంతో ప్రధాన బీటీ రహదారులపైనే ఆరబెడుతున్నారు. వాతవరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఎప్పుడు గాలి వీచినా, మేఘావృతమైనా ధాన్యం కాపడుకునేందుకు రైతులు పడుతున్న కష్టాలు చెప్పలేని విధంగా ఉంటున్నాయి. వరికుప్పల వద్ద రాత్రివేళలో కాపలా కాస్తు, ఎప్పుడు తమ ధాన్యం కాంటా వేసే సమయం వస్తుందో అని ఎదురు చూస్తున్నారు. ఐకేపీ, పీఏసీఎస్‌ల ద్వారా వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా.. సమయానికి తగు విధంగా హమాలీలు లేకపోవడంతో ధాన్యం ఎత్తడానికి జాప్యం జరుగుతుందని వాపోతున్నారు. అమరచింత మండలంలోని నాగల్‌కడ్మూర్ ప్రధాన రహదారిపై నిత్యం రైతులు తమ వరిని రహదారిపై ఆరబోస్తూ వాటిని తిరిగి కుప్పలుగా పెడుతుండడంతో అటు వాహనదారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి హమాలీల కొరత తీర్చి కాంటాలు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.